# కథ

## సి.జయాబాలకృష్ణ

# రాయి కాని మనసు

ఆదివారం ఉదయం ఏడు గంటలు దాటి అర గంట అయింది. ఆఫీసు లేదని ఎంతగా పక్కమీద దొర్లినా ఎక్కువసేపు పడుకోలేకపోయింది నిర్మల. పక్కనే పడుకున్న నిర్మల పదేళ్ళ కూతురు శృతి కూడా లేచింది.

"గుడ్ మార్నింగ్ శృతీ! లే... లేచి ముఖం కడుక్కో! పాలు తాగుదువుగాని" అని లేచి స్నానాల గదివైపు నడిచింది నిర్మల.

వంట ఇంట్లోకి వెళ్ళి, పాలు కాచి, తను కాఫీ కలుపుకుంది. శృతికి పాలు కలిపి, హాలులోకి వచ్చి టీ.వి. పెట్టింది. శృతి బాల్కనీలోకి వెళ్ళింది పాలగ్లాసు తీసుకుని.

టీ.విలో పాత పాటలు వస్తున్నాయి. రఫీ పాట బాగుంది. పాట శ్రావ్యంగా చెవులకు సోకుతున్నది. కాఫీ తాగటం పూర్తి చేసి, పేపరు చేతిలోకి తీసుకున్నది.

పేపరు చూస్తూ కూర్చుంది నిర్మల. రాజకీయాలూ, రభసలూ, రణగొణధ్వనులూ, వాతావరణ కాలుష్యాలూ... ఎన్నో! ఎన్నెన్నో వార్తలు! అవి దాటి ఒక్క ప్రక్కగా రాసిన వార్త ఆకట్టుకుంది నిర్మలని.

చదివిన తరువాత మనసంతా బాధగా అనిపించింది.

మూడోసారి కూడా 'ఆడపిల్ల' పుట్టిందని గొంతుపిసికి పసికందుని అంతం చేసిన తండ్రి! అందులో 'ఆడపిల్ల' అన్నమాట, 'కన్నతండ్రి' అన్న మాట కాస్త పెద్ద అక్షరాలతో వున్నాయి. కన్న తండ్రే కసాయివాడై హంతకుడైతే ఇంక ఆ పిల్లలకి, ముఖ్యంగా ఆడపిల్లకి రక్షణ ఎక్కడ? ఇంక 'తండ్రి' అన్న మాటకి అర్థం ఎక్కడ వుంది!

'మరి.. తన సంగతో!' క్షణం తరువాత అనిపించింది నిర్మలకి. కాస్త మనసుని కదిలించే ఏ వార్త చదివినా, చూసినా, అది తనకే అన్వయించుకోవటమూ, బాధపడటమూ... ఒక రకమైన మానసిక బలహీనతే!' అనుకుంది. ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

"రవీ! ఈ రోజు హాస్పటల్‌కి వెళ్దాం" అన్నది నిర్మల రవికి కాఫీ కప్పు అందిస్తూ.

"ఎందుకు? ఒంట్లో బాగాలేదా?"

"బాగానే వుంది. నువ్వు నాన్నవి అయిపోతావేమోనని మీ అమ్మా, నాన్నా, మా అమ్మా, నాన్నా...తాతలూ, నాయనమ్మలూ, అమ్మమ్మలూ అవుతారేమోనని... ఆ సంగతి డాక్టరు చూసి చెబితే, బాగుంటుంది కదా!" అన్నది చిన్నగా నవ్వుతూ.

"ఊ.." ఆలోచనలో పడ్డాడు రవి.

"ఏమిటి... ఇంత మంచి వార్త చెబితే, అంత పరధ్యాన్నం ఏమిటి?"

"అబ్బాయికి ఏం పేరు పెట్టాలి అని" అన్నాడు తను కూడా కాస్త నవ్వుతూనే.

"అబ్బాయి అని అంత ఖచ్చితంగా చెబుతున్నావు? అమ్మాయి అయితే?"

"అమ్మాయి పుట్టకూడదు, నాకు ఇష్టంలేదు"

కాస్త ఆశ్చర్యం వేసింది నిర్మలకి. "ఎవరు పుడతారో మనకి తెలియదు కదా! పిల్లలు ఇప్పుడు వద్దు, అసలు వద్దు అన్నది మన చేతుల్లో వున్నది గానీ, అబ్బాయే కావాలి, అమ్మాయే కావాలి అన్న విషయం మాత్రం మన చేతుల్లో లేదు కదా రవీ!"

"గొప్ప వేదాంతమే చెప్పావు. సరే... తయారవు. డాక్టరు దగ్గరికి వెళ్దాం" అన్నాడు.

ooo

హాస్పటల్‌లో స్కానింగ్ తీసింది డాక్టరు.

నిర్మలకి మూడో నెల.

మళ్ళీ వచ్చేవారానికి అప్పాయింటుమెంటు తీసుకుని వచ్చారు ఇద్దరూ.

ఇంటికి వచ్చిన దగ్గర నుంచీ రవి చాలా ముభావంగా వున్నాడు. రాత్రి భోజనాలు ముగిసినాయి. అత్తగారు, మామగారితో విషయం చెప్పాలని తొందరగా వుంది నిర్మలకి. అమ్మా, నాన్నకి కూడా ఫోన్ చేసి చెప్పాలని వుంది. 'అందరికీ నేను చెబుతాను' అన్నాడు రవి. నిర్మల ఊరుకుంది.

రాత్రి భోజనాలు ముగిశాయి. అప్పుడూ తన తల్లీ, తండ్రితో తను తండ్రి కాబోతున్న విషయం చెప్పలేదు రవి. 'రేపైనా చెప్పేయాలి' అని అనుకున్నది నిర్మల.

"నిర్మలా!" పిలిచాడు రవి రాత్రి గదిలో కూర్చుని.

"ఊ...!" పలికింది.

"నువ్వు అబార్షన్ చేయించుకోవాలి" అన్నాడు సూటిగా.

"అబార్షనా! ఎందుకు రవీ? అంతా బాగానే వుంది అని చెప్పింది డాక్టరు. మనకి అమ్మాయి పుడుతుంది" ఆనందంగా అన్నది నిర్మల.

"అందుకే అబార్షన్. ఆడపిల్ల నాకు అసలు ఇష్టం లేదు. వెంటనే అబార్షన్ చేయించుకో. వచ్చేవారానికి అప్పాయింటుమెంటు తీసుకున్నాను" అన్నాడు.

"ఆడపిల్ల మీకు ఇష్టంలేదా? ఆడపిల్ల ఏం చేసింది? ఎందుకు ఇష్టం లేదు?" ఆశ్చర్యంగా అడిగింది నిర్మల.

"వాదనలు అనవసరం నీరూ! నాకు ఇష్టంలేదు. నువ్వు అబార్షన్ చేయించుకోవాలి" ఖచ్చితంగా చెప్పాడు రవి.

"నేను అబార్షన్ చేయించుకోకపోతే? పాపని ఎత్తుకోవటం మానేస్తావా?"

ఒక్కసారి నిర్మల వంక చూశాడు.

"అంత దూరం కూడా రాదు. నువ్వు ఇక్కడ వుండక్కరలేదు"

"ఖచ్చితంగా"

నిర్మల మనసు మూగబోయింది. పుట్టబోయే పాప ఎవరైనా గానీ - ఎన్నో వూహించుకుంది. మరి... ఇదే మిటి?

ooo

మర్నాడు... రవి ఊరుకోలేదు. తన తల్లీ, తండ్రీ ముందు అడిగాడు నిర్మలని అబార్షన్ చేయించుకోమని.

"నాకు ఇష్టంలేదు అత్తయ్యగారూ! అమ్మాయి అయితే ఏమిటి? ఆడపిల్లలు ఎంతో బాగా చదువుకుంటున్నారు. మంచి మంచి ఉద్యోగాల్లో, గొప్ప పదవుల్లో వుంటున్నారు. ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. తల్లి, తండ్రులకి పేరు తెస్తున్నారు. ఆఖరికి తల్లి తండ్రుల్ని కూడా బాగా చూసుకుంటున్నారు"

"అవన్నీ అనవసరం. నాకు ఆడపిల్ల ఇష్టంలేదు. నువ్వు నేను చెప్పినట్లు వినాల్సిందే"

"చూడు నిర్మలా! మమ్మల్ని మా అబ్బాయిలు చూసుకుంటారు. వాళ్లని వాళ్ల కొడుకులు చూసుకుంటారు. నువ్వు కనే కూతురే మా రవిని చూసే ఖర్మ వాడికి పట్టలేదు. ఏ విషయమైనా మొండికెయ్యకూడదు. నీకే నష్టం. మా రవి చెప్పినట్టు విను" ఖచ్చితంగా అన్నారు రవి తల్లి తండ్రులు రామారావుగారు, లలితమ్మ ముక్తకంఠంతో.

ఫలితం.. రవి నుంచి నిర్మల దూరంగా వచ్చేసింది. నిర్మల తల్లి తండ్రులు కృంగిపోయారు కూతురి కాపురం పాడైపోతుందేమోనని.

మహిళా సంఘానికి, ఇంకేవో సంఘాలకీ తెలియపరిచి, వాళ్లచేత రవిని బెదిరించి, జాగ్రత్తలు చెప్పి, నిర్మల కాపురం చక్కపెట్టాలని నిర్మల తల్లి తండ్రులు అనుకున్నారు. "ఇంకా కడుపులోనే వుండి, లోకంలోకి రాని శిశువుని 'ఆడపిల్ల' అనే కారణంతో కన్న తండ్రే అంతం చెయ్యాలని అనుకోవటం... జీర్ణించుకోలేకపోయింది నిర్మల. ఎలాగైతే ఏమిటి రవి చాలా క్రూరంగా ప్రవర్తించాడు. అలాంటి హంతకుడి నీడలో నేను బ్రతకలేను" అన్నది నిర్మల.

ooo

నిర్మలకి శృతి పుట్టింది.

నిర్మల తల్లీ, తండ్రీ నిర్మలనీ, శృతినీ ప్రేమగా చూసుకున్నారు. నిర్మల ఉద్యోగంలో చేరింది. కాలం కదలికలో

నిర్మల తల్లీ, తండ్రీ కాలం చేశారు.

తన జీవితం ఇప్పటికి సాఫీగానే గడిచిపోతున్నది. చుట్టు ప్రక్కల వారి విమర్శలూ, వేళాకోళాలూ, చులకన చేయటం ఇప్పుడు అంతగా లేవు. చుట్టుపక్కల, ఆఫీసులోనూ కూడా ఎంతో కొంత మంచినే సంపాదించుకుంది. మంచి మనిషిగానే పేరు తెచ్చుకున్నది. నిర్మల కూతురు శృతి బాగానే చదువుకుంటున్నది. ఎప్పుడైనా తన అక్కా, బావ పిల్లలతో ఢిల్లీ నుంచి వచ్చి వెళ్తూ వుంటారు. తన కూతురికి తండ్రి ప్రేమ తెలియకుండా పెంచుతున్నది. ఎన్నో కోరికలకి దూరమైంది. తను శారీరకంగానూ, మానసికంగానూ ఒంటరిదే-కానీ... తన కోరికల్నీ, ఆలోచనల్నీ దూరం చేసుకుని వాస్తవంలో బ్రతుకుతున్నది. తన శృతిని సక్రమంగా పెంచి పెద్ద చెయ్యాలి. తన కాళ్లమీద తను నిలబడే స్థితికి శృతి రావాలి. రేపు శృతి పెరిగి, పెద్దదైన తరువాత అన్నింటినీ అర్థం చేసుకునే సంస్కారం రావాలి. అదే తన కోరిక'


"ఏయ్... నిర్మలా! ఏమిటి అంత దీర్ఘాలోచన?" వచ్చి పలకరించింది పక్క ఫ్లాటులో వుంటున్న విజయ.

విజయ పలకరింపుతో గతం తాలూకు ఆలోచనలకి తెరపడింది నిర్మలకి.

"ఏమిటి విజయా? ఎక్కడికి తయారయ్యావు?" అడిగింది నిర్మల.

"ఇవ్వాళ మా రమేష్ పుట్టిన రోజు. వృద్ధాశ్రమానికి వెళ్లి స్వీట్లు ఇద్దామని"

"అలాగా!" అన్నది నిర్మల. ఇంతవరకూ తన గురించే ఆలోచించిందిగానీ - పాపం... ఈ విజయ! అయిదు సంవత్సరాల క్రితం... ఈ విజయ కూతురు మూడు సంవత్సరాల వయసులో వుండగా విజయ భర్త గుండె నొప్పి వచ్చి అకస్మాత్తుగా చనిపోయాడు. అవసరానికి ఉద్యోగంలో చేరింది. తన కూతురు స్వప్నతో ఇక్కడే ఫ్లాటులో ఒంటరిగా వుంటున్నది. అప్పటి నుంచీ నిర్మలా, విజయా మంచి స్నేహితులైనారు. రమేష్ అంటే ఎంతో ప్రేమ విజయకి. అతను భౌతికంగా లేకపోయినా అతని గురించి ఏదో చెయ్యాలనే తాపత్రయం. తనదే కాదు సమస్య! ఎందరికో ఎన్నో సమస్యలు... పరిష్కారాలు వెతుక్కుంటూ సాగిపోవటమే... విజయని గురించిన ఆలోచనల నుంచి బయటపడి, "విజయా! ఒక్క పావుగంట ఆగు. నేనూ, శృతి కూడా వస్తాము, ఏం తోచటం లేదు" అని లేచింది.



"సరే. త్వరగా తయారవు" అన్నది. అక్కడే కూర్చుంది విజయ టి.వి చూస్తూ. పావుగంట తరువాత - నిర్మల శృతితో కలిసి విజయ, విజయ కూతురు స్వప్నతో కలిసి వృద్ధాశ్రమానికి బయలుదేరారు.

ooo

ఉదయం పది గంటల సమయం, వృద్ధాశ్రమం ప్రశాంతంగా వుంది. విజయ, ఆశ్రమంలోని యాజమాన్యాన్ని కలిసి, తను వచ్చిన పని గురించి చెప్పింది. తను తీసుకువచ్చిన పళ్లూ, స్వీట్లూ ఇచ్చింది. ఆఫీసు వాళ్లు సంతోషంగా తీసుకుని అక్కడ వున్న వారికి పంచుతున్నారు.

వచ్చిన పని అయిపోయింది. విజయ, నిర్మలా బయటకి వచ్చారు పిల్లలతో.

ప్రక్కనే వున్న గదిలో నుంచి అప్పుడే ఒక పెద్దావిడ కారిడార్‌లోకి వచ్చింది, ఆవిడకు షుమారు డెబ్భై సంవత్సరాలు వయసు వుంటుంది.

కారిడార్‌లోకి వచ్చిన ఆవిడని చూసింది నిర్మల. తరువాత ఆవిడని గుర్తుపట్టింది. గుర్తు పట్టిన తరువాత ఆశ్చర్యపోయింది.

ఆవిడ కూడా అక్కడ నిలబడి నిర్మలనీ, విజయనీ, పిల్లలనీ అలాగే ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది.

"ఏమిటి నిర్మలా! ఆవిడ వంక అంత ఆశ్చర్యంగా చూస్తున్నావు? నీకు తెలుసా?" అడిగింది విజయ.

చిన్నగా నవ్వింది నిర్మల.

"ఇంతకీ ఎవరు తల్లీ ఆ స్త్రీ మూర్తి? నిన్ను ఇన్ని భావాల్లో ముంచెత్తుతున్న ఆవిడ ఎవరమ్మా?"

"చెప్పనా?"

"చెప్పమనేగా నా యీ కంఠశోష!"

విజయ కూతురు స్వప్న, నిర్మల కూతురు శృతి కారిడార్‌లో అటూ, ఇటూ తిరుగుతున్నారు.

"ఆవిడ నా మాజీ అత్తగారు లలితమ్మగారు"

"వ్వాట్!"

"అవును" నవ్వింది చిన్నగా.

"అదే... నిన్ను ఆడపిల్లని కనవద్దని, ఇంట్లోనుంచి వెళ్లిపొమ్మని, తన కొడుకుతో పాటు శాసించిన తల్లి ఈవిడా!"

అవును అన్నట్టు బుర్ర ఊపింది నిర్మల.

"అందుకేనా ఆవిడ నిన్ను అంతగా చూస్తున్నది?"

"బహుశాః కావచ్చు. ఆవిడా నన్ను గుర్తుపట్టిందేమో!"

"సరే.. మనకెందుకులే. పద... వెళ్దాం" అన్నది అడుగు ముందుకువేస్తూ.

"ఒక్కసారి ఆగు విజయా!"

"ఎందుకు?

"ఒక్కసారి ఆవిడని పలకరించి వెళ్దాం, ఆవిడా ఇటే చూస్తున్నది పాపం!"

"పాపమా! వాళ్లకా? నీకా? వాళ్లు నిన్ను ఈ స్థితికి తెచ్చారు. ఆవిడ మీద నీకు ఇంకా జాలేమిటి?"

"జాలి కాదనుకో. ఏదో పెద్దావిడ. ఆవిడా మనవైపే వస్తున్నది. ఒక్కసారి 'హలో' చెబుదాం" ముందుకి నడిచింది.

"బాగున్నారా?" నిర్మల ఆవిడ దగ్గరికి వచ్చి పలకరించింది.

"నిర్మలా!" ఆశ్చర్యంగా అన్నది విజయ ఒకప్పటి అత్తగారు లలితమ్మ.

"అవును. నిర్మలనే"

"రామ్మా! నా గదిలోకి రా!" పిలిచింది.

విజయ నిర్మల చెయ్యి పట్టుకుంది వెళ్లిపోదామని, "లేదండి! వెళ్లాలి"

"ఒక్కసారి లోపలికి రా" బ్రతిమిలాడుతున్న ధోరణి వుంది ఆవిడ గొంతులో. తప్పక లోపలికి నడిచింది నిర్మల. అయిష్టంగానే అనుసరించింది విజయ. పిల్లలు కారిడార్‌లోనే వున్నారు.


విజయని పరిచయం చేసింది నిర్మల. వాళ్లు అక్కడికి వచ్చిన విషయం గురించి చెప్పింది.

"మీరు.. ఇక్కడ... ఈ వృద్ధాశ్రమంలో వుంటున్నారేమిటి?" అడిగింది నిర్మల.

"ఏం చెప్పనమ్మా! అన్యాయంగా నిన్ను బాధపెట్టాం. దేవుడు మాకు తగిన శిక్ష వేశాడు. 'ఆడపిల్ల' వద్దు అబార్షన్ చేయించుకో అని మా అబ్బాయి నిన్ను హింసపెడుతూ వుంటే వాడికి బుద్ధి చెప్పాల్సింది పోయి, వాడిని మందలించటం మానేసి వాడిని సపోర్టు చేశాం. వాడితో పాటు మేమూ నిన్ను హింసపెట్టి తరిమేశాం. మా రవి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. అమెరికా వెళ్లాడు. వాడికి ఇద్దరూ కొడుకులే పుట్టారు. కానీ ఏం లాభం మా కొడుకులూ కోడళ్లూ... మమ్మల్ని తరిమివేశారు. మేము వాళ్లకి అడ్డంట. రెండు సంవత్సరాల క్రితం మా ఆయన

## గడసరి హన్సిక!

*తనకన్నా దాదాపు పాతికేళ్లు పెద్దవాడైన గోవిందాతో హీరోయిన్‌గా 'మనీ హైతో హనీ హై'లో నటిస్తోంది కుర్రపిల్ల హన్సిక. 'నిజంగా గోవిందా సార్‌తో నటించడం భలే థ్రిల్లింగ్‌గా ఉంది' అని చెప్పే హన్సిక- ఈ సినిమాలో మీ పాత్రేంటీ? అంటే సస్పెన్స్- అవన్నీ మీరు అడక్కూడదు నేను చెప్పకూడదు- అని ముక్కున వేలేసుకుంటోందిట. అలాగే చేయబోయే సినిమాలేంటీ అని అడిగినా వాటి గురించి కూడా నో కామెంట్స్ అంటోంది హన్సిక. మొత్తానికి గడుసుపిల్లే కదా!*



పోయారు. అప్పుడు నా కొడుకులు రాలేదు. చుట్టాల సహాయంతో ఆయన్ని సాగనంపాను. తరువాత ఎప్పుడో వచ్చి, ఇల్లు అమ్మి, ఇక్కడ కొంత డబ్బు కట్టి నన్ను ఇక్కడ చేర్పించి వెళ్లిపోయారు" ఆవిడ కళ్లల్లో నీరు తిరిగింది.

వింటూ కూర్చుంది నిర్మల. లలితమ్మగారు పశ్చాత్తాపంతో బాధ పడుతున్నది.

"నిర్మలా! నీ జీవితం అన్యాయంగా నాశనం చేశాం. దేవుడు మమ్మల్ని క్షమించడు తల్లీ! పెద్దవాళ్లం అయి వుండీ, మా రవికి మంచి బుద్ధి చెప్పాల్సింది పోయి, వాడిని రెచ్చగొట్టాం, దేవుడు మాకు తగిన శాస్తి చేశాడు. ఏదైనా అనుభవంలోకి వస్తే గానీ తెలియదమ్మా! మగపిల్లలు ఉద్ధరిస్తారనీ, వంశం నిలబెడతారని, ఆడపిల్ల అంటే ఖర్చులూ బాధ్యతలూ అని చులకన. ఆడపిల్లని హింసపెట్టి తరిమివేసిన వాళ్లం... నువ్వు వెళ్లిన తరువాత తెలిసింది నీ మంచితనం. నువ్వు మమ్మల్ని ఎంత ప్రేమగా చూసుకునేదానివి! చేతులారా నిన్ను దూరం చేసుకున్నాం. నన్ను క్షమించు తల్లీ!" నిర్మల చేతులు పట్టుకుంది లలితమ్మ.

"ఛ... ఛ... అలా అనకండి. మీరు పెద్దవారు. జరిగిందేదో జరిగిపోయింది మరి... మేము వెళ్తాం" లేచింది నిర్మల.

నిర్మల కూతురి గురించి లలితమ్మ అడిగింది.

బయట కారిడార్‌లో వున్న శృతిని పిలిచింది విజయ. "నమస్తే!" అన్నది శృతి వచ్చి.

"శృతీ! మామ్మగారు" అన్నది.

"బంగారు బొమ్మలా వుందమ్మా!"

నిర్మల, విజయ, పిల్లల్ని తీసుకుని బయలుదేరారు.

○○○

ఇంటికి వచ్చిన తరువాత విజయ నిర్మలని ఆటపట్టిస్తూనే వున్నది, వేళాకోళం చేస్తూనే వున్నది.

నిర్మలకి మాత్రం మనసు బాధపడింది. లలితమ్మని గురించి ఆలోచిస్తూనే వున్నది.

ఇంక ఆవిడ గతి ఏమిటి? కన్న తల్లి తండ్రుల మీద ప్రేమలూ, అభిమానాలూ వాళ్లకి లేవా?

ఆవిడ కొడుకు రవి ఆనాడు తనకి పుట్టబోయేది ఆడపిల్లని తెలిసి హంతకుడుగా మారి నాడు భార్యని, నేడు కన్న తల్లినీ తరిమివేశాడు. మనిషిలో కనీస మానవత్వం కూడా చచ్చిపోయింది. వయసు మళ్లిన పెద్దలకి ఇంత నీడనిచ్చే యీ వృద్ధాశ్రమాలు కూడా లేకపోతే ఈ వృద్ధులు అనాధల్లా రోడ్లమీద, చెట్లక్రింద, పేవ్‌మెంట్ల మీద బ్రతకాలా?

నిర్మల మనసు బాధపడ్డది. సమయం దొరికినప్పుడల్లా విజయంతో ఈ విషయం గురించి మాట్లాడుతూనే వున్నది.

"అమ్మా తల్లీ! ఎరక్కపోయి నిన్ను ఆ ఓల్డేజ్ హోమ్‌కి తీసుకువెళ్ళాను. అప్పటినుంచీ నా బుర్ర తింటూనే వున్నావు" అంటూనే వున్నది విజయ.

"ఏమిటో విజ్జీ! ఆ లలితమ్మగార్ని చూస్తే బాధ కలుగుతోంది, ఎంత హుందాగా అందంగా వుండేది! ఎలా అయిపోయింది పాపం!"

"అంత జాలిగా వుంటే తెచ్చి ఇంట్లో పెట్టుకో. బుద్ధి లేదు నీకు, చూసినవి మర్చిపోవాలిగానీ, మనసు పాడుచేసుకోకూడదు" మందలించింది విజయ.

○○○

పదిహేను రోజుల తర్వాత విజయ, నిర్మల కాంప్లెక్స్ ముందు ఆటో ఆగింది. బాల్కనీలో నిలబడి చూస్తున్నది విజయ.

ఆటోలో నుంచి నిర్మల, శృతితో పాటు లలితమ్మగారు దిగారు. వాచ్‌మేన్ బ్యాగ్ తీసుకుని విజయతోపాటు వస్తున్నాడు. ఆశ్చర్యపోయింది విజయ. ఆ సాయంత్రం నిర్మల వచ్చింది వి జ య్ ం ఇంటికి. "నీకు చెప్పకుండా లలితమ్మ గారిని తీసుకువచ్చాను విజ్జీ!"



"నీకు అసలు బుద్ధిలేదు నిర్మలా!" అన్నది విజయ.

"విజయా! లలితమ్మగారిని చూస్తే బాధ అనిపించింది. ఏమైనా సరే రాను అన్నది ఆవిడ. కొన్ని రోజులుందురుగాని అని బ్రతిమిలాడి తీసుకువచ్చాను. నా గురించి ఆవిడ తను చేసిన తప్పుతో పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు. ఎంతో బ్రతిమిలాడితే కొద్ది రోజులకి ఆఖరికి... శృతి బ్రతిమిలాడితే వచ్చింది"

"ఏమిటో నిర్మలా అనుబంధం! నీకూ వాళ్లకీ ఏ బంధం మిగిలిందనీ! ఆవిడ లాంటి వాళ్లు అక్కడ చాలా మంది వున్నారు మరి"

## హిట్ కొట్టిన ఈషా!

హేమమాలిని కూతురు ఈషా డియోల్ తాజాచిత్రం 'వన్ టూ త్రీ' ఆమెకి మంచి పేరే తెచ్చింది. ఓ తమిళ అమ్మాయి పాత్రని పోషించింది ఈషా ఇందులో. స్వతహాగా తమిళురాలైన హేమమాలిని ఈ సినిమాలో తన కూతురి నటనను ఇంతదాకా చూల్లేదట. కారణం- స్టేజ్ డాన్సులతో హేమ బిజీగా వుండడమేనట. తనకంటూ మంచి గుర్తింపు తెచ్చిపెట్టిన ఈ సినిమాని వీలైనంత త్వరలోనే తన మమ్మీకి చూపించి తీరతాననంటోంది ఈషా. 'వన్ టూ త్రీ'లాంటి కామెడీ సినిమాలో నటించిన ఈషా రాబోయే చిత్రం 'హైజాక్' అనే యాక్షన్ సినిమా.

"అక్కడ వున్న అందరినీ ఉద్ధరించే శక్తిలేదు విజయా! చట్టపరంగా ఏ బంధమూ లేదు. కాకపోతే నా కూతురికి ఆవిడ నాయనమ్మ. అది కూడా కాదు విజ్జీ! ఒక్కటి వుంది. మానవ సంబంధం, మానవతా బంధం. ఇంకొక సంగతి చెప్పనా?"

"ఏమిటో...అది?"

"ఇందులో కొంచెం స్వార్థం కూడా వుంది" చిన్నగా నవ్వింది.

"స్వార్థమా!?"

"అవును... నా కూతురికి నాయనమ్మ వునికి తెలుస్తుంది. పెద్దవాళ్లు ఇంట్లో వుంటే వాళ్లతో ఎలా మసలుకోవాలో తెలుస్తుంది. రేపు భవిష్యత్తులో నా కూతురు నన్ను వదిలెయ్యకుండా నన్ను చూసుకుంటుందని ఆశ! దానికి మెల్లగా అసలు విషయం చెబుతాను. ఇప్పుడే చెబితే ఆవిడ మీద ద్వేషం పెంచుకుంటుంది"

"నిమ్మీ! నువ్వు గొప్పదానివే, నీ మనసు రాయికాదు, స్ఫటికం" నిర్మలని కౌగిలించుకుంది విజయ.

సాయం సంధ్య అందంగా పడమటి దిక్కున పరచుకుంది.

○